
# హీరో + హీరో = జీరో




నటించడం ఒక కళ!

ఎంతో కొంత ప్రతివ్యక్తికీ జన్మతః ఈ కళ అబ్బుతుంది. అయితే రంగస్థలంమీద నటించగల వాళ్ళు జీవితంలో నటించలేరు. జీవితంలో నటించగలవాళ్ళు రంగస్థలంపై రాణించలేరు. జీవితంలో నటించగలవాళ్ళు లౌక్యులు. రంగస్థలంపై రాణించగలవాళ్ళు నటులు. ఈ అభిప్రాయమే నిజమైతే కృష్ణ చక్కని నటుడు!

కృష్ణనుచూస్తే ఎవ్వరూ నటుడని చెప్పలేరు. మనిషి నలుపు. పక్షపాతం లేకుండా నెరసిన వెంట్రుకలు తెలుపు. పలకరిస్తే పలుకుతాడు.

లేకుంటే బెల్లంకొట్టిన రాయిలా ఉంటాడు. ఆ మనిషిని చూసి ఇత డొక కళాకారుడంటే—చూచినవాళ్ళు చెప్పిన వాళ్ళనుచూచి విరగబడి నవ్వు తారు. అయినా అతడు కళాకారుడు!

కృష్ణ దినము వేషం వేస్తాడు. అంటే—అతడేమీ సినిమాలో ఎడ తెరిపి లేకుండా 'కాల్‌షీట్సు' యిచ్చే నట శిఖామణికాదు. నాటక సమాజాల్లో అసలేకాదు. అయినా అతడు దినము వేషం వేస్తాడు. అది చాలా సాదా సీదా వేషం.

కట్టుకున్నది నాలుగుమూరల అడ్డతుండుగుడ్డ. అరవకట్టుతో అలానే ఉంటుంది. అక్కడక్కడ చిరుగులుబడి, పెద్ద పెద్ద చిరుగులకు చేతికుట్టు పడి ఒక మోస్తరుగా మాసిన చొక్కా ఉంటుంది. ప్రతిరోజు ఉదయం తంచనుగా పదిగంటలకు ఆ మాసిన చొక్కామీద మరింత మాసిన కాకి చొక్కాను దర్జాగా ధరిస్తాడు. దాంతో వేషం, వేషంతో కలిసి ప్రవర్తన మారిపోతాయి!

ఇంతకూ అత డా వేషం వేసి పోషిస్తున్న పాత్ర ఏమిటంటే— అది చాలా చిన్న పాత్ర. జానెడు పొట్టకోసమని ప్రారంభించి, పొట్ట నిండేసరికి పుట్టెడు ఆశలతో తట్టెడు బరువు మోయడానికి నిర్వహిస్తున్న పాత్ర. ఆ పాత్ర పేరుచెబితే ఆఫీసులో ఫైళ్ళకు కాళ్ళువచ్చి కదులుతాయి. కారియర్లు హోటళ్ళనుండి నడుస్తాయి. ఆఫీసర్లు ఊరెళ్ళతానంటే—పెట్టె బేడా సునాయాసంగా బస్సుస్టాండు చేరి అక్కడితో ఆగక బస్సుపై కెక్కు తాయి. మార్కెట్టులో కూరలు మారు పలక్కుండా అమ్మగారిచేతి కందు తాయి. ఆఖరికి అమ్మగారి కోపతాపాలు శ్రమలేకుండా ఆశ్రయాన్ని సంపా దించుకుంటాయి! కార్యాలయం పరిభాషలో, పరభాషలో చెప్పాలంటే— అతడొక ప్యూన్! ఈ ప్యూన్ ఇన్ని పనుల్ని విసుగు విరామం లేకుండా చేస్తాడు కాబట్టి—ఆఫీసర్లు దయతలచి అతడొక ఉత్తముడని ముద్ర వేశారు!

కృష్ణ పలకా బలపం చేతబట్టి 'ఓ'కు ఒంపులు దిద్దకపోయినా జీవితంలోని ఒంపు సొంపులను అవగాహన చేసుకున్న మేధావి! ఈ మేధావి రంగస్థలంపై బిచ్చగాని వేషం వేస్తే—బిచ్చగాడే అడుక్కోవడంలో మెలకువలు నేర్చుకోవాలి. రాజువేషం ధరిస్తే—రారాజులే ఆ దర్పం దర్జా అలవర్చుకోవడానికి ఆరాటపడాలి. దుష్టపాత్రల జోలికిపోతే—'వీడమ్మకడుపుమండా! వీడు మనిషా?' అనాలి. హాస్యపాత్రల్ని చేబట్టితే ప్రేక్షకులు నవ్వలేక కడుపులు చేతపట్టుకుని మెలికలు తిరగాలి. ఈ కళ అతనికి గురుశుశ్రూషతో అబ్బిందికాదు. పుట్టుకతో వచ్చింది.

నీళ్ళులేని ఏటి ఒడ్డున ఒక పల్లెలో, పూట పూటకూ నీళ్ళు నమిలే కుటుంబంలో మూడంకణాల పూరి కొంపలో పుట్టాడు కృష్ణ. తొలి చూలు మగసంతానం. కూటికి లోటయినా కూర్మికి లోటులేని కుటుంబం. కింద దించితే మట్టి అవుతుంది! చంక కెత్తుకుంటే గద్ద తన్నుకుపోతుంది - అన్న ముద్దు ముచ్చటల్లో అయిదేళ్ళు పెరిగాడు. ఆరవ ఏట బడికి పొమ్మంటే - నీళ్ళులేని ఏట్లోకి నడిచాడు. తల్లిదండ్రులు ఎంత ప్రయత్నించినా కృష్ణ బ్రతుకు ఏటిపాలయింది.

ఏటిమీద ఎంతో మమకారం కృష్ణకు. బడికి వెళ్ళినట్లుగా వెళ్ళి ఎప్పుడో ఏట్లోకి ఉడాయించేవాడు. ఏట్లో ఒంటరిగా ఆడుకొనే వాడు. బొమ్మరిండ్లు కట్టేవాడు. అంతలోనే వాటిని తుడిపేసి 'కొళ్ళో కొళ్ళని!' గంతులు వేసేవాడు. బడి వదిలే వేళకు సరిగ్గా యిల్లుచేరేవాడు.

ఆ వూరికి మైలు దూరంలో ఆ ఏటికి అవతలి ఒడ్డున అంతకంటే ఒక పెద్ద ఊరుంది. ఆ వూళ్ళో ఒక సినిమా టెంటుంది. సాయంకాలానికి అక్కడ చేరేవాడు. అనువైన చోట బోర్లగిల పడుకొని సందుల గుండా కనుపించినంతవరకు సినిమా చూసేవాడు. రెండు మూడుసార్లు వింటే చాలు సినిమాపాట—అలానే పాడేవాడు, ఏ పాటయినా సరే! తెగిన గాలిపటంలా తిరుగుతున్న బుడంకాయంత బుల్లోడిని దారిలో పెట్టలేక తల్లి

తం(డులు తిట్టారు. కోపగించుకొని కొట్టారు. (బతిమలాడారు. ఏం ప్రయో జనం లేకపోయింది. ప్రయత్నాలు ఫలించకపోయేసరికి భవిష్యత్తును కర్మ మీదికి నెట్టి, యింటికి వస్తే అంత సంకటో, సలిబిండో వాడి మొగాన పారవేయడానికి నిర్ణయించుకొన్నారు.

చెప్పకుండా చెందకుండా మరో అయిదేండ్లు గడిచిపోయాయి.

అప్పుడా ఊరికొక బుర్రకథ దళం వచ్చింది. వరుసబెట్టి వారం రోజులు మకాం వేసిందా దళం ఆ వూళ్ళో. రాత్రి కొక కొత్త కథవంతున. చెబుతున్నది.వారం తిరిగేసరికి కృష్ణ వాళ్ళచుట్టూ తిరగడానికి తయారయ్యాడు. గాత్రముందని గమనించిన ఆ దళం చేరదీస్తే వాళ్ళతో చేరిపోయాడు. వంతపాడుతూ కొన్నాళ్ళు తిరిగాడు. ఆ తరువాత ఆ దళాన్ని తలదన్నే కథానాయకు డయ్యాడు! బుర్రకథలు చెబుతూ ఊళ్ళు తిరుగుతున్న సమ యంలో ఒక వూళ్ళో నాటకాల కంపెనీతో పరిచయమంది కృష్ణకు. ఏమను కున్నాడో ఏమో? బుర్రకథలకు స్వస్తి పలికాడు. నట సమాజంలో చేరి పోయాడు!

ఆ నటసమాజంలో చేరి ఆంధ్రదేశమంతటా తిరిగాడు. ఊరూరా వాడ వాడా నాటకాలు వేశాడు. ఏ పాత్రనయినా అవలీలగా నటించగల సమర్థు డనిపించుకొన్నాడు. పరిషత్తుల్లో పాల్గొన్నాడు. బహుమతులు గెల్చు కొన్నాడు. కృష్ణ లేకపోతే నటసమాజమే లేదనిపించే ఎత్తుకు ఎదిగిన మనిషి ఉన్నట్లుండి ఒకనాడు దభాలున క్రిందపడ్డాడు. అందరు చేరి ప్రయత్నించిపైకి లేపడానికి యత్నిస్తే ససేమిరా కాదన్నాడు. సాటి నటులు గింజుకొన్నారు. (బతిమాలుకొన్నారు.కంట తడిబెట్టారు. కళామతల్లికి తీరని ద్రోహమన్నారు. చెప్పినవన్నీ శ్రద్ధగా విన్నాడు కృష్ణ. బదులుగా అందరికీ కలిపి ఒక నమ స్కారం పారేసి తల చుట్టి నోటివద్దకు వచ్చినట్లుగా తన గ్రామాన్ని చేరు కొన్నాడు.

ఇప్పుడు కృష్ణ పాతికేళ్ళ పడుచువాడు.

వచ్చిందే చాలనుకున్నారు తల్లిదండ్రులు. వచ్చి యికమీదట ఏం చేయాలి?—అన్న ఆలోచనలో పడ్డాడు కృష్ణ. ఆ మీదట ఏట్లో పడ్డాడు. అదే ఏరు. అదే ఇసుక. అదే దూరంగా కనిపిస్తున్న సినిమా టెంటు. దూరంగా కొండలు. దగ్గరగా బోడి గుట్టలు—అన్నీ అలానే ఉన్నాయి. లేదంటే మునుపు ఏరు విశాలంగా ఉండేది. ఇప్పుడు స్వార్థుడైన మనిషి చేతుల్లో పడి సన్నగిలిపోయింది. ఇటువైపు అటువైపు ఏటిగట్లను సాధ్యమయినంతవరకు ఆక్రమించుకొని సాగు చేసుకొంటున్నారు మానవులు!

జీవితంమీద కృష్ణ దృక్పథం మారింది. బుర్ర కథ దళంతో తిరిగినప్పుడు కానీ, నాటక సమాజాల్లో వేషాలు వేసేటప్పుడుకానీ, అతనికి బాధ అన్న పదానికి అర్థమే తెలియదు. తినడము, నిద్రపోవడం....పొద్దుపోవడంతో నిద్రలేచి మొగానికంత రంగు పులుముకొనడం — అదొక చిత్రజత్తు. ఆ జగతిలో అతని పాత్ర ఆతనికే తెలియని గతి. ఇప్పు డా ప్రపంచాన్ని వదిలాడు. వాస్తవ జగత్తులో అన్నీ సమస్యలుగానే ఉన్నాయి. తన వెనుక ఒక మగ, ఇద్ద రాడపిల్లల్ని కన్నారు తల్లిదండ్రులు. తమ్ముడు చదువుకొంటున్నాడు. చెల్లెలికి పెండ్లీడు వచ్చింది. మరొక అమ్మాయి వోణికోసం పేచీపెడుతూ ఉంది. ఆ స్థితిలో మూడుపూటలూ అంతో ఇంతో తిని గోళ్ళు గిల్లుకొంటూ ఏట్లో కూర్చోవడం ఎంతో యిబ్బందిగా ఉంది కృష్ణకు.

ఒకరోజు సాయంకాలం నాలుగుగంటల సమయం. ఏట్లో కూర్చున్నాడు కృష్ణ. ఎటో చూస్తున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు. గతం అందంగా కనుల ముందు మెదులుతూంటే భవిష్యత్తు అంధకారంగా ఉంది. ప్రస్తుతం వెక్కిరిస్తూ విస్తుపోతూ ఉంది. ఆ సమయంలో ఎవరో కొందరు నడక పరుగ్గా వచ్చారు. గసపోస్తూ కృష్ణను చుట్టుముట్టారు. "బాబూ! ఇవి చేతులు గావు!" అన్నారు.

కృష్ణ వింతగా వాళ్ళవైపు చూశాడు.

"రాత్రికి తిరుపతిలో నాటకం. బాలనాగమ్మ కథ. మాయలఫకీరు వేషం వేసేవాడు. మోసం చేశాడు. తీరా సమయానికి మాయచేసి పారిపోయాడు. టిక్కట్లు అమ్ముకొన్నాం. నాటకం ఆగిపోతే మొగమెత్తుకొని వీధుల్లో తిరగలేం. ఎలాగయినా రక్షించాలి బాబూ!"

అన్ని చేతులు కలిసి పట్టుకొన్నది రెండు చేతుల్ని!

చిరునవ్వు నవ్వాడు కృష్ణ!

నాటకం బ్రహ్మాండమన్నారు ప్రేక్షకులు!

అందులో మాయలఫకీరు పాత్ర మరువలేమన్నారు!!

"ఏం చేస్తుంటావు బాబూ!"—నాటకానంతరం వేషం విప్పుకొంటూంటే ఎవరో ఓ పెద్దమనిషి కృష్ణను ప్రశ్నించాడు.

"ఏట్లో కూర్చుని గోళ్ళు గిల్లుకొంటూ వుంటానండీ!" సమాధానం వికటంగా ఉన్నా, వినయంగా అన్నాడు. విరగబడి నవ్వాడా పెద్దమనిషి.

"ఎందుకంత మంచిపని చేస్తున్నావు, బాబూ!"

"ఏం చేయమంటారు చెప్పండి? తల్లిదండ్రులు ఎంతో ఆశగా చదువుకోరా అని బడికి పంపితే నేనేమో ఏట్లోకి నడిచాను. ఏటిగాలి కొట్టింది. ఆ గాలివాటంగా కొట్టుకుపోయాను. ఎలా పట్టుకొనిందో ఈ మాయదారి పిచ్చి పట్టుకొనింది. పుట్టినవూరూ వాడా వదులుకొని వూరూరూ తిరిగాను. పిచ్చి కుదిరింది. కుదరకుండా మిగిలింది బ్రతుకుతెరువే!— అందుకే ఇంతకంటే మంచిపని చేయలేకపోతున్నాను."

మళ్ళీ విరగబడి నవ్వాడా పెద్దమనిషి!

"అయితే రేపు ఉదయాన ఎట్టి పరిస్థితిల్లోనూ ఏట్లోకి వెళ్ళవద్దు. మళ్ళీ ఏ గాలి వాటంగా మళ్ళుతుందో మనసు. నేరుగా వచ్చి ఆఫీసులో నన్ను కలుసుకో! పిచ్చి కుదిరే మందిస్తాను!" కృష్ణభుజం తడుతూ అన్నాడా పెద్దమనిషి.

గంగిరెద్దులా ఆనందంగా తల ఆడించాడు కృష్ణ. ఆ పెద్దమనిషి వెళ్ళిపోయాడు. ఆయన వెళ్ళిపోయిన తరువాత కసక్కుమని నాలుక కరచుకొన్నాడు కృష్ణ. 'అయ్యో! ఏ ఆఫీసు? ఎవరా పెద్దమనిషి? అని అడిగి తెలుసుకోలేకపోయానే?' అని. అప్పటికే అతని చుట్టూ చేరిన అతని అభిమానులు అతని అవస్థను గమనించారు.

"బాబూ! రాజులు పోయారు. ప్రజలు రాజులైనారు. అయితే రాజుల్లోని ఆ ఔదార్య సంపత్తి ప్రజల్లో ఇంకనూ రాలేదు. అందుకే రాజాదరణలో ఎదుగుతుండిన కళలు ఎదుగు బొదుగులేకుండా నిలబడిపోయాయి. ఏదో కళాభిమానులయిన ఒకరిద్దరు ఆఫీసర్లు నూటికో కోటికో ఉండడం మూలానే ఈ మాత్రమైనా కళాపోషణ జరుగుతూ వుంది. ఆయన దృష్టిలో పడడంతో నీ అదృష్టం పండిందిలే!" అప్రస్తుతం కాకపోయినా అయాచితంగా నేటి లలితకళల తీరుతెన్నులపై ఓ విసురు విసిరి, తన అధిక్యతా ప్రదర్శన రక్తికట్టిందో లేదో అని దిక్కులు చూచి కృష్ణ సందేహాన్ని తీర్చి పుణ్యం కట్టుకొన్నాడింకొక పెద్దమనిషి.

కృష్ణ మనసు తేలికపడింది. తేలికపడిన మనసు తెల్లవార్లూ ఊహాగానాలతో తేలియాడింది. తెల్లవారింది. పది గంటలకు కృష్ణ బయలుదేరాడు. పండు ముత్తయిదువ తన తల్లిని ఎదురు రమ్మన్నాడు.

ఆదరా బాదరా ఆ తల్లి దొడ్లో పూస్తున్న ముద్దబంతి పువ్వుల్ని రెండుకోసి ముసిముసిగా కొప్పులో తురుముకొనింది. నట్టింటి దీ గూట్లో కుంకుమ బరిణలో అంత కుంకుమ తీసి నొసట దిద్దుకొంటూ చిరునవ్వులతో ఎదురయింది. 'వెళ్ళివస్తానమ్మా!' అని కృష్ణ బయలుదేరుతుంటే ఎవరో రెండు తుమ్ములు తుమ్మారు. వెనుక తుమ్ము మంచిదన్నారు. ఆనందంగా బయలుదేరాడు కృష్ణ. ఎవరో ఓ సినిమా కంపెనీ వాళ్ళు స్వయంగా వెదుక్కుంటూ వచ్చి హీరో వేషం వేయమంటే ఎంత సంతోషపడతాడో అంతకంటే రెట్టింపు సంతోషంతో నడిచాడు.

పదిన్నర గంటలకు ఆఫీసు చేరుకున్నాడు. ఆఫీసర్ని చూశాడు.

రాత్రి పలుకరించిన వ్యక్తికీ, ఆఫీసరు హోదాలో కూర్చున్న యితనికీ వేషంలో కానీ, ప్రవర్తనలో కానీ ఏమాత్రం పోలికలే లేవు! ఒక్కసారి తల ఎత్తి చూశాడు. ఒక్క చిరునవ్వు నవ్వాడు. కూర్చోమనలేదు. తన నటనా కౌశల్యానికి ముగ్ధులైన మునుపటి ఆఫీసర్లలాగ కాసంత కాఫీ అయినా ఇవ్వలేదు. అక్కడెక్కడా పూల మాల ఉన్నట్లు కనుపించలేదు. ఇదేనా తన అదృష్టం? ఆశ్చర్యపడ్డాడు. ఆశ్చర్యం నుండి ఆలోచనలో పడ్డాడు కృష్ణ.

కాలింగ్ బెల్ మ్రోగింది!

మ్రోగి ఆగిన అర నిముషానికి మరో వ్యక్తి లోపల ప్రవేశించాడు. వచ్చిన వ్యక్తి నిలబడివున్న వ్యక్తిని గమనించాడు. ఆఫీసరు కనుసన్నల్ని చూశాడు. అర్థమయిందన్నట్లుగ కృష్ణ మెడతో "డవాల్" వేశాడు. కృష్ణ బిత్తరపోయి చూస్తున్నాడు. ఆఫీసరు ఆనందంగా చేతులు తడుతున్నాడు.

"చూడు బాబూ! ఏటిగాలి మంచిదిగాదు. గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవడం మగవాడి లక్షణం కాదు. నీ ప్రతిభకు ప్రతిఫలంగా నేను వేసిన పూలమాల ఇది. ఇది వాడని పూలమాల. నీ జీవితానికి వెన్నెల తేగల కంఠమాల!—జాగ్రత్త." అని హెచ్చరించాడు ఆఫీసరు. చేతులు జోడించాడు కృష్ణ.

నట సమాజంలో హీరో కృష్ణ—ఇప్పుడు కార్యాలయంలో జవాను!

కాలం గడిచిపోతూ వుంది. కన్న ప్రేవులు దారినపడ్డ బిడ్డను చూచి ఆనందపడ్డాయి. దారి తోడు అందివ్వడం తమ ధర్మమనుకొన్నాయి!

తల్లిదండ్రులు చూపిన దారి తోడు—తోడు నీడై బాధ్యతల్ని పంచుకొన్నట్టే కనుపిస్తూ బాధ్యతల్ని పెంచింది.

కృష్ణకు ఇద్దరాడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు.

కృష్ణ జవాను పనిచేస్తున్నాడు. ఆఫీసర్లని వప్పిస్తున్నాడు.

కృష్ణ హీరో వేషాలు వేస్తున్నాడు. జనాన్ని మెప్పిస్తున్నాడు.

హీరో కృష్ణ వుంటున్న ఊళ్లోనే మరో హీరో ఉన్నాడు. అయితే అతడు నాటకాల్లో హీరో కాదు. జీవితంలోనే హీరో!

హీరో కృష్ణ ఎప్పుడో చిన్నప్పుడు ఏట్లో కూర్చుంటే ఏటి గాలికి కొట్టుకపోయాడు. కానీ ఈ హీరో ఏటి గట్టున నిలబడి ఆ ప్రాంతాన్ని అలా కలయచూస్తే అది ఏటి పరంబోకు అయింది. అక్కడి నుండి సరాసరి ఇంటికి నడిచి, అరుగుమీద కూర్చుని కలం పుల్ల చేతబట్టి కనుబొమ ముడిస్తే తలారి రాముడు యాభై ఎకరాల భూస్వామి అయ్యాడు. తల మాసిన మరొకడు ఎడమచేతి వేలి ముద్రవేసి, వంద ఎకరాల స్థితిపరుడయ్యాడు. అయితే తలారి రాముడికికానీ, తలమాసిన వేలిముద్రకు కానీ తాము భూస్వాములు, ఆసాములు అయిన సంగతి అసలు తెలియదు.

ఈ హీరో ఇద్దరి తలరాతల్ని చేతపట్టుకొంటాడు. పట్టుకొన్న సంగతి పసిగట్టడం మహా కష్టం. రచ్చబండ వద్ద నిలబడతాడు. నోరు నవ్వుతూ ఉంటుంది. నొసలు వెక్కిరిస్తూ ఉంటుంది. ఆ కాగితాలను చూపి బేరం పెడతాడు—కొమ్ముల్ని చూపి బేరమాడినట్లుగా. అగ్రిమెంట్లు పుడతాయి. పైకం చెల్లింపబడుతుంది. పత్రాలు రిజిష్టరవుతాయి. అయినా అమ్మిన వాడెవరో కొన్న వాడికి తెలియదు.

అతడు ఆలోచిస్తే అమాయకులు పోలీస్ స్టేషనులో తన్నులు తింటారు. నెల నెలా ఆ ప్రాంతంలో ఉన్నతాధికారులు అతని ఇంట్లో విందులు తింటారు. అతడు పెదవి విప్పితే తలగుడ్డలు మారుతాయి. తలచుకొంటే తలలే మాయమవుతాయి. అతడు కనుబొమలు ముడిస్తే తలరాతలు తారుమారవుతాయి.

జీవితంలో అసలు సిసలైన ఈ హీరో ఒకనాడు హీరో కృష్ణకు ఎదురయ్యాడు. దారిలో ఈ హీరోలు ఎదురుపడడం అదే మొదటిసారిగాదు. ఎన్నోసార్లు ఎదురయ్యారు. అలా ఎదురుపడితే హీరో కృష్ణ వినయంగా

దారి తొలిగేవాడు దేనికైనా మంచిదని. కానీ ఈ సారి హీరో కృష్ణను దారి తొలగ నివ్వలేదు. అడ్డం నిలబడ్డాడు. అంతవరకు విలన్‌లకు ఎదురు నిలబడడమే ఎరిగిన కృష్ణ—ఈ హీరో అడ్డం నిలబడేసరికి ఆశ్చర్యపడ్డాడు. కృష్ణ ఆశ్చర్యం నుండి తేరుకోక ముందే ఆ హీరో చేతులు పట్టుకొన్నాడు.

"కృష్ణా! నువ్వు హీరోవి. నేనూ హీరోని. ఈ ప్రాంతాల్లో మనకు ఎదురు లేదు. అయితే నేను చక్కగా బతుకుతున్నాను. హీరో లాగా దర్జాగా కార్లో తిరుగుతున్నాను. నువ్వు కాలికి కాలు కొట్టుకొంటూ నడుస్తున్నావు. ఇదేం బాగా లేదు బాబూ! హీరో అని పేరు తెచ్చుకున్న నువ్వు హీరోలాగ బతకాలి. అది నా కానందం."

"ఆనందంగా బతకాలని అందరికీ ఉంటుంది. అయితే చాతగావద్దూ."

"ఏమీ లేదు. ఒక్క పదివేలు సర్దు. మిగతా పని నా కప్పగించు. నే చూస్తా!"

"పదివేలా.... సర్దడమా?.... పదివేలంటే.... ఏమిటీ చిల్లపెంకులా?"

"ఒరే పిచ్చోడా! నీకు తెలుసునో, తెలియదో! మీ అమ్మ నాన్న ఇంటికోసమని ఖాళీ జాగా కొనిపెట్టా రెప్పుడో! ఏముందక్కడ? పెంట కుప్పలు జిల్లేళ్ళు.... వగైరా.... వగైరా....! ఈ జన్మలో ఇల్లు కడతావా? ఆ ఇంట్లో కాపురం పెడతావా? అది కల్ల. అందుకే నువ్వు 'ఊఁ!' అను. ఆరేడు వేలు రాలుతుంది. ఇంకాస్త ముక్కావంటే మూడువేలు: పదివేలు చేతికొస్తే బంగారం పండే నేల పదెకరాలు!" అంతవరకు చేతులు పట్టుకొన్న హీరో, కృష్ణ మెత్తపడడం గమనించి, భుజం తడుతూ విలన్‌లాగా నవ్వాడు!

ఆలోచనలో పడ్డాడు కృష్ణ. ఎదురుపడ్డ హీరో ఎవ్వరో కాదు. గ్రామకరణం. సాధారణంగా అతడు ఇల్లు విడిచి కాలు కదపడు. కానీ కార్లు అతని ఇంటి ముందు బారులు తీరి నిలబడి ఉంటాయి. పెద్దపెద్ద మనుష్యులు పెద్ద పెద్ద వేషాలతో ఆ కార్లు ఎక్కుతూ, దిగుతూ ఉంటారు.

అతని దర్శనంకోసం తపిస్తూ ఉంటారు. ఆలాంటప్పుడు అతడే స్వయంగా ఎదురుపడి చేతులు పట్టుకొని సలహా యిస్తున్నాడంటే, తన అదృష్ట రేఖ మారింది. సిరి రా మోకాలడ్డడం అవివేకం అనుకొన్నాడు కృష్ణ. అను కొన్నదే తడవుగ అమ్మా నాన్న కొండంత ఆశతో కొనిపెట్టిన ఖాళీ జాగాను బేరం పెట్టాడు. బేరం పెట్టిన వారం తిరక్క ముందే అమ్మాడు. ఆరు గాదు—హెచ్చుతక్కువగా చేత ఏడు రాలింది. ఇక మూడు వేలు. మూడు వేలకోసం నాలుగు దిక్కులు చూశాడు. దిక్కులన్నీ శూన్యంగా కనిపిస్తే ఒక్క దిక్కున తన మూడంకణాల పూరిల్లు ప్రత్యక్షమయింది.

అందులో తన శ్రీమతి కంటపడింది. శ్రీమతి మనస్సులో మెదల డమే తరువాయి. అతని పెదవులపై చిరునవ్వు వెలసింది. ఒక్క పరుగున ఇల్లు చేరాడు. హీరో కృష్ణ వున్నట్లుండి విలన్ అయ్యాడు. శ్రీమతిని ఉన్నపళంగా నిలబెట్టి ఒలిచాడు ముక్కుపుడకతో సహా!—ఒక్కటిన్నర వేలు జమ అయింది. ఇంకనూ ఒకటిన్నర వేలు. అప్పటికే చలువలు కమ్మాయి. నిలబడలేక కూర్చున్నాడు. కూర్చుని కుదురుగ ఆలోచించాడు. ఉన్నట్లుండి ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. టీ కొట్లో బావమరిది టీ చల్లారుస్తూ ఠీవిగా కనుపించాడు.

పరుగందుకొన్నాడు కృష్ణ. టీ అంగట్లో దూరాడు గసపోస్తూ! బావ రెండు చేతులు వొడిసి పట్టుకొన్నాడు. 'బావా! ఇవి చేతులుకావు!' అన్నాడు. టీ బలవంతంగా యిస్తే తాగని బావమరిది, చేతులు కాదని చేతులే పట్టుకొనే సరికి నీళ్ళుగారిపోయాడు బావ. అటూ ఇటూ చూశాడు. ఏముంది? నీళ్ళు కాగుతున్న బాయిలర్. పాలుకాగుతున్న సత్తుపాత్ర. చేయిజారితే పుటుక్కు మనే గాజు గ్లాసులు. ఏమీ తోచక వెనక్కు తిరిగి చూశాడు. హీరోగారి చెల్లెలు. అన్న రాకను గమనించి పరామర్శించడానికి వచ్చి నిలబడింది. నిలబడ్డ మనిషిని నిలబడ్డట్లుగా నిలబెట్టి నిలువు దోపిడీ చేశాడు బావ. రక్తం పంచుకొని పుట్టిన సోదరికి తన కన్నుల ఎదుటనే నిలువు దోపిడీ జరుగు తూంటే మింగలేక కక్కలేక గిలగిలలాడిపోయాడు హీరో!

అయినా తప్పలేదు.

ఆ తరువాత కథా క్రమం బెట్టిదనిన—

ఈ హీరో కన్న తిప్పలుపడి ప్రోగుచేసిన పదివేలు ఆ హీరో చేతుల్లో పోశాడు. ప్రతిఫలంగా ఆ హీరో ఈ హీరోకు పదెకరాల భూమిని చూపించాడు. సరిహద్దు రాళ్ళను నాటించాడు. అమ్మిన వాడినుండి అగ్రిమెంటు నుండి అసలు పత్రం వరకు అందచేశాడు. తన పని తీరినట్లుగా చేతులు దులుపుకొన్నాడు. కృష్ణ చేతులు కలిపి మొక్కాడు. గ్రామకరణంగారింట్లో ఇనప్పెట్టె మరో పదివేలను యిముడ్చుకొని కప్పను తిన్నపాములా ఉబ్బింది!

ఏక చదరంగా ఉన్న పదెకరాల భూమి మధ్యభాగాన నిలబడ్డాడు కృష్ణ. చుట్టూ కలయచూశాడు. పొద్దెక్కుతూ ఉంది ఎక్కుతున్న పొద్దులోని వెలుగు రేఖలు తన జీవితానికి ఆశా రేఖలు!—ఎండిన ఏట్లో ఇసుక బంగారు రంగుతో భ్రమ పెడుతూ ఉంది. చుట్టూ పచ్చని పొలాలు....దూరంగా ఆ ప్రాంతాలకు హద్దులుగా నిలచిన కొండలు....మనోహరంగా ఉందా ప్రదేశం. ఓ స్టూడియో నిర్మిస్తే—ఎంత బాగుండునో అనుకొన్నాడు కృష్ణ. ఎక్కడో చెట్టుమీది పిట్ట 'కికికీ!' అన్నది. పిట్ట వెక్కిరిస్తున్నదా? అని సిగ్గుపడ్డాడు. సిగ్గుతో తల వాలిపోయింది. అప్పుడు కంటపడింది తన భూమి పరిస్థితి—అది ఇసుక వాటంగా ఉంది!

ఆలోచనలో పడ్డాడు కృష్ణ. ఇసుకనేలలో పంటలు పండవు. తివిరి ఇసుమున తైలంబు కాకపోయినా కనీసం పంటలు పండించాలి. పంటలు పదెకరాల్లో బాగా పండి, మాసూలు బాగా చేతికి వస్తే మరో అయిదారేళ్ళలో కనీసం ఒక సినిమా తీయాలి!—ఈ ఆలోచన మనసులో మెదలుతూంటే చెట్టుమీది పిట్ట మళ్ళీ 'కికికీ!' అన్నది. ఒళ్ళు రగిలింది కృష్ణకు. చేతికందిన రాతిని వోపికున్నంత బలంగా విసిరాడు పిట్టమీదికి. పిట్ట లేచిపోయింది. కానీ ఇసుకనేల మాత్రం సమస్యగా నిలిచిపోయింది!

కనీసం ఒకటిరెండు వరుసలయినా బంకమట్టి తోలకపోతే ఆ ఇసుక

నేలలో విత్తు మొలవదు. ఏం చేయాలి? తలలో ఆలోచన ఉంది. ఊరి ముందర చెరువులో బంకమట్టి ఉంది. ఆలోచన నెరవేరాలంటే చెరువులో బంకమట్టి చేనిమీద పడాలి. దానికి బండీ, ఎద్దులు కావాలి!

మళ్ళీ పరుగందుకున్నాడు కృష్ణ. ఊరుగాని ఒక ఊళ్ళో నటుడుగాని ఒక నటుడున్నాడు. అత డొక పెద్ద రైతు. ఆ రైతుకు నాటకాలంటే సరదా. హీరో వేషం అంటే మరీ సరదా! ఆతడు కృష్ణతో కలిసి కొంత కాలం నాటకాలాడాడు. అతనివద్దకు వెళ్ళాడు. అవసరాన్ని తెలిపాడు. బండి కొనడానికి ఒక వెయ్యి ఎద్దులు కొనడానికి మరో వెయ్యి వెరశి రెండువేలు అప్పు ఇవ్వమన్నాడు. కాగితం రాసిస్తా నన్నాడు. వడ్డీ మొదలు ఒక్క ఏడాదిలో తీరుస్తా నన్నాడు. హీరో కృష్ణ మాటలువిని హీరో కాలేని ఆ రైతు విలన్‌లాగా నవ్వాడు.

"కృష్ణా! స్నేహితుల వద్ద ద్రవ్య సంబంధమయిన వ్యవహారాలు తగవు. అవి ఏనాటికీ తెగవు. అందులో బాకీ అసలే తగదు. ఈ మాటలు చెబుతున్నది నేనుగాదు బాబూ!—చెబుతున్నది శాస్త్రం." మోజుకొద్దీ పెంచుకొన్న మీసాన్ని మెలిపేస్తూ పలికాడు రైతు. కృష్ణ మొగం వన్నెలు మారుతూ ఉంది.

"కాబట్టి నేను ఇవ్వగలిగినా నీకు మాత్రం బాకీ ఇవ్వను."

మెడలు వాలిపోయాయి కృష్ణకు. మెల్లగా బయలుదేరాడు.

"చూడు కృష్ణా!"

తిరిగి చూశాడు కృష్ణ.

"నువ్వు గొప్ప కళాకారుడివి. నేను నీ అభిమానిని. నా దగ్గర నీ అభిమానం దెబ్బతినకూడదు. కాబట్టి శాస్త్ర సమ్మతమైన ఒక సలహా చెబుతాను." ఆశగా చూస్తూ నిలబడ్డాడు కృష్ణ.

"ఊరి ముందర చింతచెట్టు కింద బండి ఉంది. ఇంటి ముందర పశువుల కొట్టంలో రెండు కాండ్ల ఎద్దులున్నాయి. నీ ఇష్టం వచ్చిన కాడెద్దులకు

బండి కట్టు. నీ ఇష్టం వచ్చినన్నాళ్ళు చెరువులో మట్టి చేనికి తోలుకో!—ఆ తరవాతనే బండిని తోలి పంపు!"

ఎగిరి గంతేశాడు కృష్ణ. ఆ ఊపులోనే బండి నొగమీద పడ్డాడు.

'పల్లెకుపోదాం! పారునుచూదాం! చలో చలో!'అన్నంత సంబరంగా 'బంకమట్టిలో బంగారు! బ్రదుకు బాటలో పొంగారు!' అని పాడుకొంటూ ఊరు చేరుకొన్నాడు కృష్ణ.

ఉద్యోగానికి సెలవుపెట్టాడు. తమ్ముడిని బడి మానిపించాడు. వయసు మళ్ళిన తల్లిదండ్రులను కూడా వదలకుండా పురమాయించాడు. ఇక భార్యా చెల్లెళ్ళ మాట సరేసరి! చెరువులో బంకమట్ట త్రవ్వుతున్నారు. తట్టల కెత్తుతున్నారు. బండి నింపుతున్నారు. నిండిన బండి నిముషాలమీద చేనిని చేరుతూ ఉంది. ఇసుకలో బంకమట్టి కలుస్తూ ఉంది. ఇంటిల్లపాదీ అహోరాత్రాలు పనిచేస్తూ ఉంది.

ఒకనాటి మిట్టమధ్యాహ్నం. ఎండ తీసి కాస్తూ ఉంది. చేనిలో బండి నిలిపాడు కృష్ణ. వలిపటి ఎద్దు మెడ పలుపు విప్పాడు. దాపటి ఎద్దు మెడ పలుపు విప్పాలనుకున్నాడు. మట్టి కుమ్మరించాలన్న తొందరలో బండినొగను పైకెత్తాడు. ముందున్న మట్టి వెనక్కు జరగడంతో అమాంతంగా బండి పైకి లేచింది. దాపటి ఎద్దు కాడితో కలిసి పైకి లేచి పోయింది. నాలుగు కాళ్ళు గిలగిలా కొట్టుకొంటూ పెనుగులాడింది. మెడ పలుపు వూడలేదు. తెగలేదు. మెడకు బాగా బిగుసుకు పోయింది! దాని ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి!

ఆ హఠాత్సంఘటనతో హడలిపోయాడు కృష్ణ. తలరాతను నిందించుకొంటూ తల బాదుకొన్నాడు. అయినా ఆ ఎద్దు బ్రతకలేదు. అతని బాధను వినే నాథుడు కనుపించలేదు. అయినా ధైర్యాన్ని వదలలేదు కృష్ణ. బండిలోని బంకమట్టిని చేనిలో తోశాడు. వలపటి ఎద్దును కాడికి కట్టాడు. తాను దాపటి ఎద్దు పాత్ర ధరించాడు. ఖాళీ బండి చెరువును చేరింది. ఆ పరిస్థితిని చూచి, జరిగింది విని అందరూ బావురు మన్నారు.

కృష్ణ హీరో అయ్యాడు. అందరికీ ధైర్యం చెప్పాడు. ఆ మీదట వూరిమీద పడ్డాడు. పట్టని వాళ్ళ కాళ్ళు లేదంటూ పట్టి అంతో ఇంతో అరువు తెచ్చాడు. అయ్య చేతిలో పెట్టాడు. దాపటి ఎద్దును కొనడానికి వూళ్ళమీదికి పంపాడు. కానీ, పనిమాత్రం అవలేదు. ఇప్పుడు తానూ, తన తమ్ముడు కలిసి దాపటి గిత్తబరువు లాగుతున్నారు.

వారం రోజులు గడిచాయి. ఓపికున్నంత వరకు ఆ కుటుంబం చెమటోడుస్తూనే ఉంది. చేర్చగలిగిన మేరకు చెరువులో బంకమట్టిని చేని మీదికి చేర్చారు. ఆ తరువాత చేనిమీద బండితో కుప్పలుగ పోసిన మట్టిని తట్టలతో తీసి చేనిమీద చల్లుతున్నారు. ఒకనాడు పొద్దు వాలింది. నెత్తిమీద తట్టతో నిలబడిన తమ్ముడు 'అదో ఎద్దును తోలుకొని వస్తున్నాడు నాన్న!' అని అరుస్తూ ఒక్క వూపులో తట్టలోని మట్టిని చేనిపైకి విసిరి, ఖాళీ తట్టను ఎగురవేస్తూ ఎగిరెగిరి పట్టుకొంటున్నాడు ఆనందం పట్టలేక. కృష్ణ వూరబెట్టిన ఉద్దిపప్పులా ఉబ్బి పోతున్నాడు. అందరూ ఆ క్షణాన ఆనంద పరవశులయ్యారు. అయిదు పది నిమిషాల్లో అయ్య రానే వచ్చాడు 'అబ్బా' అని నిట్టూరుస్తూ, దాపటి గిత్త పగ్గాన్ని కొడుకు చేతి కందించాడు.

సరిగ్గా అదే సమయానికి అక్కడికి వచ్చి ఆగిందొక కారు. ఆ కారు వెనుక ఒక జీపు! మరో వ్యాను!

అందమైన కారులో నుండి అంతకంటే అందమైన ఒక యువతి దిగింది! జీపులోనుండి రెవిన్యూ అధికారులు దిగారు! వ్యాను నుండి పోలీసు దళం దిగింది.

అందమైన యువతి అందంగా నడిచింది. మహారాణిలా నడిచింది! అధికారులు అడుగులకు మడుగులొత్తినట్లు అనుసరించారు! ఆమె కృష్ణను సమీపించింది. బిత్తరపడి చూస్తున్న హీరో ముందర హీరోయిన్లా నిలబడింది. ఒక చేతిలో వయ్యారాలు పోతుండిన చేతి సంచిని రెండు చేతులతో పట్టుకొంది. సంచిని విప్పింది. అందులోనుంచి ఒక పాత కాగితాన్ని

తీసింది. కృష్ణను చూడమన్నట్లుగ ఇచ్చింది. కృష్ణ తీసుకున్నాడేగాని చూడ లేకపోయాడు. చూడమని తమ్ముడి చేతికి ఇచ్చాడు.

"కొంప మునిగిందన్నయ్యా!" అన్నాడు పత్రాన్ని చూసిన తమ్ముడు. అర్థంకాక అయోమయంగా తమ్ముడివైపు చూశాడు కృష్ణ.

"అన్నయ్యా! మనం కొన్నదే కాదు—ఈ ప్రాంతమంతా ఈ మహా రాణిగారిదేనట. ఇది హక్కుపత్రం." కోపంతో విసిరి కొట్టాడా పత్రాన్ని. గాలికి కొట్టుకుపోతున్న పత్రాన్ని ఒక రెవిన్యూ ఉన్నతాధికారి ఉరికి పట్టు కొన్నాడు. కొరకొర చూస్తూ వినపడకుండా గొణుక్కుంటూ ఆమె చేతి కందించాడు.

"అందరినీ మెడబట్టి అవతలికి గెంటండి!"

అధికారులనే ఆజ్ఞాపించిం దామె. ఆమెకాదు. ఆ పని చేసిందామె అందం. అంత పని జరిగింది. అందానికి అంత బలముంది.

కుప్పగ కూలిపోయాడు కృష్ణ.

"ఒరే నాయనా! కాడెద్దు జోడయింది. చేను బీడయింది. కొడుకు చేసిన చేతలకు అబ్బ బందారాకు మోయాల్సి వచ్చింది! లేరా!"

"నాన్నా! నేను నాటకాల్లో హీరోని. వాడా గ్రామకరణం జీవితంలో హీరో. హీరో హీరో కలిస్తే ఈ విలన్లంతా బలాదూర్ అనుకొంటి. కానీ ఈ విలన్ల వాతపడి బ్రతుకే జీరో అయింది."

అని—అనవలెననుకొన్నాడు కానీ....అనలేకపోయాడు.

నవంబరు 75, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక.